క్లుప్తంగా

వీఓఏల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న వీఓఏలు

చందుర్తి: తమ వేతనాన్ని పెంచేంత వరకు విధులు చేపట్టబోమని తెలుపుతూ గ్రామ సమైక్య అసిస్టెంట్లు, ఐకేపీ ఏపీఎం రజితకు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం తమ పనికి తగ్గ వేతనాన్ని ఇచ్చేంత వరకు విధులు చేపట్టమని సోమవారం నుంచి ఏప్రిల్ 30 వరకు విధులకు దూరంగా ఉంటామని సమ్మె నోటీసులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.3,900లతో కుటుంబ పోషించుకోలేక, ఆన్‌లైన్ వర్క్ లోడు అధికంగా అవుతోందని వారు ఆవేదనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సమైక్య అసిస్టెంట్లు శశిధర్, స్వప్న, వినోద, పద్మ, మమత, అంజలి, కవిత, మానసలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రైతులకు రుణాల చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్

ఇల్లంతకుంట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది రైతులకు రూ.52 లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను ఇల్లంతకుంట సింగిల్‌విండో చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సహకార సంఘం ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. సీఈవో రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



కంటి పరీక్ష చేయించుకుంటున్న జెడ్పీటీసీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లె గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కనకట్ల వెంకయ్య, కనకట్ల తిరుపతి, డాక్టర్ శ్రావంతి, వైద్య సిబ్బంది ఉన్నారు.

వేములవాడఅర్బన్: మండలంలోని శాభాష్‌పల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్ పండుగ ప్రదీప్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, వైస్ ఎంపీపీ రేగులపాటి రవిచందర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం

- కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టులకు మరమ్మతు నిల్
- నిధుల విడుదలలో జాప్యం
- 19 ప్రాంతాల్లో ప్రయాణం నరకం
- కల్వర్టుల వద్ద వరుస ప్రమాదాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



వెంకటాపూర్ వద్ద రోడ్డు పక్కనే గుంత

ఎల్లారెడ్డిపేట: వర్షాకాలంలో తెగిన రోడ్లు, కల్వర్టులను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాల్సిన కనీస బాధ్యతను మరిచి అధికార యంత్రాంగం గుర్రుపెట్టి నిద్రపోతోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన అధికారులు ఏదో ఒక సాకు చెబుతూ దాటవేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో 13 తండాలు 11 గ్రామాల పరిధిలోని రహదారుల్లో ప్రధానంగా కల్వర్టులు వర్షం దాటికి కోసుకుపోగా వాటికి మరమ్మతు చేసే విషయంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వీరి నిర్వాకంతో అస్తవ్యస్తమైన ఈ రోడ్లపై నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటుచేసుకుంటునే ఉంది. మరమ్మతు పనులు చేపట్టాల్సిన పంచాయితీరాజ్, ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు మాత్రం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా డబ్బులు మంజూరులో జాప్యం జరుగుతోందని చేతులు దులుపుకుంటున్నారు. కాని వీరి నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది.

ప్రతిపాదనలు బుట్ట దాఖలు

గత వర్షాకాలం సీజన్లో వరద నీటితో కొట్టుకుపోయిన మట్టితో కల్వర్టుల వద్ద లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ప్రధాన కల్వర్టుల వద్ద ముందుగా మరమ్మతు పనులు చేయడానికి అధికారులు ప్రభుత్వానికి రూ.కోటితో ప్రతిపాదన సమర్పించారు. ప్రతిపాదనలు ఇచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు నయా పైసా మంజూరు కాలేదు. డబ్బులు వస్తేనే పనులు చేస్తామని అధికారులు చెబుతుండగా, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో పంచాయితీ పాలకవర్గసభ్యులు ముందుకు వచ్చి పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా మట్టితో తెగిన కల్వర్టులను తాత్కాలికంగా మరమ్మతు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ నిధులతో మరమ్మతు చేసుకోవాల్సి రావడంతో ఇబ్బందిగా ఉందని మరికొన్ని గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మరోసారి మండల వ్యాప్తంగా తెగిపోయిన కల్వర్టుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని మండల ప్రజలు కోరుతున్నారు. లేని పక్షంలో ఆందోళన చేయాల్సి వస్తుందంటున్నారు. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ స్పందించి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.



కోతకు గురైన కల్వర్టు

19 చోట్ల కల్వర్టులు ధ్వంసం

మండలంలోని అక్కపల్లి బుగ్గ రాజేశ్వర తండా, రాజన్నపేట, రాచర్ల గుండారం, మద్దిమల్ల, రాచర్ల తిమ్మాపూర్, సంగారం, కిష్టునాయక్ తండా, బండలింగంపల్లి, చింతకుంట తండా, దేవునిగుట్ట తండా, తదితర రూట్లో వర్షపు దాటికి కల్వర్టుల వద్ద వరద నీటితో కోసుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారెంతోమంది ఉన్నారు. రాత్రివేళ ఈ రహదారుల్లో ప్రయాణమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లడమేనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్వర్టుల వద్ద జరిగిన ప్రమాదాల్లో నెల రోజుల వ్యవధిలో 11 మందికి తీవ్రంగా, ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు.

నిధులు కేటాయించాలి



తెగిన కల్వర్టు మరమ్మతుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించాలి. కల్వర్టుల వద్ద ప్రమాదాలతో ఎంతోమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తెగిన కల్వర్టుల వద్ద కనీసం రక్షణ చర్యలు కూడా లేవు. వాటిని అలాగే వదిలేయడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

– దడిగల పరశురాంరెడ్డి, బండలింగంపల్లి

ఇబ్బందిగా ఉంది



ఎల్లారెడ్డిపేట నుంచి వెంకటాపూర్ వరకు ప్రధాన రహదారి పక్కనే కోసుకుపోయిన రోడ్డుతో పాటు కల్వర్టులు ప్రయాణానికి ఇబ్బందిగా మారాయి. రాత్రివేళ ప్రయాణికులతో వస్తున్న ఆటోలు రెండు సార్లు ప్రమాదానికి గురయ్యాయి. కల్వర్టులను మరమ్మతు చేయాలి.

– డేనియల్, ఆటో డ్రైవర్, ఎల్లారెడ్డిపేట

నిధులు రాలేదు

కల్వర్టుల మరుమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే మరమ్మతు పనులు చేపడతాం. ప్రమాదకరంగా ఉన్న కొన్ని కల్వర్టులను గ్రామపంచాయితీల సహకారంతో మరమ్మతులు చేశాం. శాశ్వత మరమ్మతులకు నిధుల కోసం నిరీక్షిస్తున్నాం. ప్రయాణికులు జాగ్రత్తగా వాహనాలు నడపాలి.

– కిరణ్, ఆర్అండ్‌బీ, ఏఈ



బోనమెత్తిన మానాల

రుద్రంగి: మండలం మానాల గ్రామంలో సోమవారం బద్దిపోచమ్మ బోనాల పండుగ ఘనంగా జరిగింది. గ్రామస్తులంతా ఇంటికో బోనంతో గ్రామంలోని పురవీధుల్లో డప్పు చప్పుళ్లు, బైండ్ల కళాకారుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా వెళ్లి నైవేద్యంగా సమర్పించారు. గ్రామాన్ని పశుసంపద కాపాడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండేలా కరుణించాలని వేడుకున్నారు. సర్పంచ్ మానస, ఎంపీపీ పిసిరి చిన్న భూమయ్య, పీఏసీఎస్ సీఈవో బాదనవేని రాజారాం, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిత్రకథ



ప్రమాదకర మలుపు

వేములవాడరూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్ ప్రాంతంలో ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న ఈ మలుపుల వద్ద కల్వర్టు కూడా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో ఈ కల్వర్టు వద్ద ప్రమాదం జరిగి ఇద్దరు వ్యక్తులు నీటిలో కొట్టుకుపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమాచారం

నేడు 'ఈశ్రమ్' శిబిరం

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని అన్ని రంగాలకు చెందిన అసంఘటిత కార్మికులకు ప్రత్యేకంగా మంగళవారం 'ఈశ్రమ్' శిబిరం నిర్వహిస్తున్నట్లు కార్మిక శాఖ సహాయ అధికారి యండీ రఫీ ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్యగల వారు, పీఎఫ్, ఈఎస్ఐ లేని వివిధ రంగాలకు చెందిన కార్మికులు ఆధార్, బ్యాంకు అకౌంట్, నామిని, పని వివరాలతో ఉచితంగా పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో జరిగే కార్యక్రమానికి కార్మికులు హాజరుకావాలని కోరారు.

22న మండల సర్వసభ్య సమావేశం

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బూర వజ్రమ్మ అధ్యక్షతన ఈనెల 22న ఉదయం 11 గంటలకు ఉంటుందని ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

రాజన్న సన్నిధిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో వేములవాడ రాజేశ్వరపురం వసతి గదుల వద్ద సోమవారం 150 మందికి అన్నదానం, వంద మంది మహిళలకు చీరలను సోమవారం పంపిణీ చేశారు. 648 రోజులుగా నిత్యం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ డీఈ రఘునందన్, మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు మహేశ్, పాలాస రాజేందర్, తోట రాజు, రఫీక్, రవీందర్, నటరాజ్, హన్మాండ్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి మహిళల వాలీబాల్ పోటీల్లో మండలంలోని రాచర్ల గొల్లపల్లి విద్యార్థినులు సత్తా చాటారు. జగిత్యాల జిల్లా గంగాధరలో నిర్వహించిన ఈ పోటీల్లో తృతీయ స్థానం సాధించి, షీల్డ్, ప్రశంసాపత్రాలను స్వీకరించారు. వీరిని సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సరోజన, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ అనిల్‌గౌడ్, హెచ్ఎం మురళీధర్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జబ్బర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ పదవికి ఉపఎన్నిక నిర్వహించాలి



వినతిపత్రం ఇస్తున్న కమలాకర్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణం లోని 26వ వార్డు కౌన్సిలర్ ఉప ఎన్నిక వెంటనే నిర్వహించాలని తెలంగాణ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల కమలాకర్ మున్సిపల్ మేనేజర్ మీర్జా ఫసాహత్ అలీబేగ్‌కు వినతిపత్రం అందించారు. కౌన్సిలర్ మృతి చెందిన చాలా రోజులైందని, వార్డుకు ప్రాతినిధ్యం లేక ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు.

ఈఆర్‌సీ చైర్మన్‌ను కలిసిన డైరెక్టర్

ముస్తాబాద్: రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగారావును సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోతుగల్ గ్రామానికి చెందిన శ్రీరంగారావు ముస్తాబాద్‌కు వచ్చిన నేపథ్యంలో ఆయనను కలిసినట్లు అంజిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం యాసంగి సాగుకు రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నందుకు ధన్యావాదాలు తెలిపారు.

రాజన్న భక్తుల దాహార్తి తీరుస్తున్న దాత



రాజన్న జలప్రసాదం వద్ద దాహార్తిని తీర్చుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్న భక్తుల దాహార్తి తీర్చేందుకు రాజన్న జలప్రసాదం పేరుతో రూ.కోటి 10 లక్షలు వెచ్చించి ఆరుచోట్ల ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటు చేసిన దివీస్ ల్యాబరేటరీస్ సంస్థ ప్రతినిధిని పలువురు అభినందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఓ దాత ముందుకొచ్చి భక్తుల దాహార్తిని తీర్చేందుకు రూ.కోటి రూపాయలు వెచ్చించడం అభినందనీయమని స్థానికులంటున్నారు. ఆరు ప్రధాన ప్రాంతాలను ఎంచుకొని ఆలయ ఇంజినీరింగ్ విభాగం ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈ రాంకిషన్‌రావు అందమైన ఆకృతిలో వాటిని రూపొందించారు. వేలాది భక్తులు దాహార్తిని తీర్చుకునేందుకు రాజన్న జలప్రసాదాన్ని వాడుకున్నారని ఆలయ ఈఈ రాజేశ్ తెలిపారు.

విజ్ఞాన యాత్రలో విద్యార్థులు



ముస్తాబాద్: మండలంలోని మద్దికుంట, మోహినికుంట ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజ్ఞాన, విహారయాత్రకు సోమవారం తరలివెళ్లారు. స్థానిక ఎంపీపీ జనగామ శరత్‌రావు సొంత ఖర్చులతో మూడు బస్ సర్వీసులను ఏర్పాటు చేసి విద్యార్థులను విశాఖపట్నం, భద్రాచలం, విజయవాడ, అరకు యాత్రలకు పంపించారు. హెచ్ఎం బాపురెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

వ్యాపారులకు జరిమానా

చందుర్తి: మండలంలోని రామన్నపేట గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న కిరాణా షాపు యాజమానులపై ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ముత్యం సందీప్‌కుమార్ సోమవారం జరిమానా విధించారు. కిరాణా షాపుల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. అలాగే గ్రామంలో కంపోస్టు షెడ్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని సూచించామన్నారు. అలాగే నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో, భవన నిర్మాణాన్ని చేపట్టే విషయమై చర్చించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ దుమ్ము అంజయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలి



మర్తనపేటలో సీసీ రోడ్డు పనులు

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటలో సీసీ రోడ్డు పనులు నాణ్యత లోపించిందని మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్, గ్రామస్తులు జవ్వాజి తిరుపతిగౌడ్, పర్శరాములు, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి ఆరోపించారు. సిరిసిల్ల–నిమ్మపల్లి రహదారి మరమ్మతు పనుల్లో భాగంగా మర్తనపేటలో సీసీ రోడ్డు పనులు చేస్తున్నారు. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని, ఇసుకకు బదులు డస్ట్ వినియోగిస్తున్నారని తెలిపారు. దీంతో రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగా మారుతుందని వాపోయారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని తెలిపారు.

చిన్ననాటి మిత్రుల కుటుంబాలకు ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: మెదడు సంబంధిత వ్యాధితో మృతిచెందిన మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన అతికం శ్రీనివాస్, గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామానికి చెందిన అంజిరెడ్డి కుటుంబ సభ్యులకు 1996, 97 పదో తరగతి బ్యాచ్ స్నేహితులంతా కలిసి ఆర్థికసాయం అందజేశారు. ఇరువురు కుటుంబాలకు రూ.15 వేలు చొప్పున నగదు అందించి, భవిష్యత్తులో ఈ కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, దేవరాజు. శ్రీధర్, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, హుస్సేన్, ఎల్లాగౌడ్, శ్రీనివాస్, నారాయణ, రాజిరెడ్డి, బాలకిషన్, సంపత్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రెస్‌లు పంపిణీ

వేములవాడరూరల్: వేములవాడలో ఉన్న బోయినపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌జేసీ పాఠశాల పదో తరగతి విద్యార్థులు 27 మందికి స్వేరోస్ నెట్వర్క్ ప్రొగ్రెస్ పేరెంట్స్ లీగ్ జిల్లా కమిటీ తరుపున డెస్కులు అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు మూలె కిశోర్, నీడూరి అభిలాష్, తెలిపారు. ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

వీర్నపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ అందజేశారు. కంచర్ల గ్రామానికి చెందిన గంప మనెవ్వ, సూర నర్సవ్వ, అడవిపదిరకు చెందిన లక్కం సత్తవ్వ, గర్జనపల్లికి చెందిన కనపర్తి భారతి, దోమకొండ గంగవ్వలకు చెక్కులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఉపసర్పంచ్ బోయిని రవి, నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట మోడల్ స్కూల్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని సోమవారం విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్ రహీం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రమేశ్, కమిటీ సభ్యులు శశికళ, సుభాష్‌రెడ్డి ఉన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు తీర్మానం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పంచాయితీ పాలకవర్గం తీర్మానించింది. సోమవారం నిర్వహించిన పాలకవర్గం సమావేశంలో కొత్త బస్టాండ్ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగించి ఆ ప్రదేశంలో విగ్రహం ఏర్పాటు చేస్తామని సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ప్రకటించారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డిపేట: స్థానిక గ్రామపంచాయతీ పరిధిలోని 13, 14 వార్డుల్లో తరచూ హై లోవోల్టేజీ విద్యుత్ సరఫరాతో గృహోపకరణాలు కాలిపోతున్నాయని వెంటనే అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని పంచాయతీ పాలకవర్గం తీర్మానించి కాపీలను ఉప సర్పంచ్ ఒగ్గు రజిత, సెస్ ఏఈకి అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని ఏఈ హామీ ఇచ్చారు.

మండల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

వీర్నపల్లి: మండల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ దేవరాజు అన్నారు. సోమవారం స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం జరుగుతున్నా, ఓర్వలేకనే కొన్ని రాజకీయ పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. గ్రామ యూత్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఉస్మాన్, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బోయిని రవి పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి

సిరిసిల్లటౌన్: దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మనవడు తారకరత్నకు సిరిసిల్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్ నివాళి అర్పించారు. సోమవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన స్మారక సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. నాయకులు రాజిరెడ్డి, సలీమ్, ఆయూబ్‌ఖాన్, కొమురయ్య, శేషాచలం పాల్గొన్నారు.